హైదరాబాద్ వార్త






# నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

## -బైపోల్‌కు 'ముప్పై ఆరు రోజులు'
## - అభ్యర్థుల ఖరారే ఆలస్యం
## - దృష్టి పెట్టిన ప్రధాన పార్టీలు
## - ఒకటి రెండు రోజుల్లో ప్రకటించే అవకాశం

**జూబ్లీహిల్స్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల షెడ్యూల్ ఖరారైంది. అక్టోబరు 13న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. నవంబరు 11న ఉప ఎన్నిక, నంబరు 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. మరో ముప్పై ఆరు రోజుల్లో ఫలితం తేలి విజేత ఎవరనేది స్పష్టంకానుంది. ఎన్నికల కమిషన్ సోమవారం జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ప్రధాన పార్టీలు ఇప్పుడు వేగం పెంచాయి. అభ్యర్థుల ఎంపికను వేగవంతం చేశాయి. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో నియోజకవర్గం నుంచి పోటీపడుతున్న ఆశావాహుల్లో ప్రధానమైన, బలమైన నాయకుల పేర్లను సూచిస్తూ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లింది. అలాగే బీజేపీ సైతం తమ అభ్యర్థుల ఎంపిక విషయంపై దృష్టి సారించారు. ఒకటి, రెండు రోజుల్లో ప్రధాన పార్టీలు తమ అభ్యర్థుల పేర్లను ప్రకటించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

### ప్రచార సమయం ఎలా..!

బీఆర్ఎస్ మినహా మిగిలిన ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు ఎవరూ ఖరారు కాలేదు. దీనికితోడు ఆశావాహుల సంఖ్య ఎక్కువగా ఉంది. ఉప ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఇప్పుడు ఆశావాహుల్లో టెన్షన్ మొదలై అధిష్టానంపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. తక్కువ సమయంలో నియోజకవర్గాన్ని ఎలా చుట్టగలమంటూ అధిష్టానం ముందు వాపోతున్నారు. ఎన్నికల షెడ్యూల్‌లో భాగంగా నవంబరు 11న పోలింగ్ తేది ఉంది. అభ్యర్థి ఖరారు మొదలు నామినేషన్ల తేది గడువు అంశాలను పరిగణలోకి తీసుకొంటే కేవలం రెండు వారల్లోనే అభ్యర్థులు తమ ప్రచారాన్ని ముగించి ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుంది. షెడ్యూల్‌కు ముందే అధికారపార్టీ నేతలు, ప్రతిపక్ష పార్టీ నేతలతో కోలహాలంగా మారిన జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రాజకీయంగా మరింత ఊపు పెరగనుంది.

### జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిచయం

మొత్తం ఓటర్ల సంఖ్య 392669
పురుష ఓటర్లు: 207367
మహిళా ఓటర్లు 191590
ఇతరులు 25
పోలింగ్ కేంద్రాలు 407

### ఎన్నికల షెడ్యూల్ ఇదే..

నోటిఫికేషన్ అక్టోబరు 13
నామినేషన్ల తుది గడువు అక్టోబరు 21
నామినేషన్ల పరిశీలన అక్టోబరు 22
నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు అక్టోబరు 24
పోలింగ్ తేది నవంబరు 11
ఓట్ల లెక్కింపు నవంబరు 14

# ఎన్నికల్లో సెక్టార్, నోడల్ ఆఫీసర్ల పాత్ర కీలకం : ఆర్ వి కర్ణన్

**హైదరాబాద్, అక్టోబర్ 6, ప్రభాతవార్త:** ఎన్నికల ప్రక్రియలో పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ పర్సన్‌లుగా సెక్టార్ అధికారు ల పాత్ర అత్యంత కీలకమని, వారు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ అన్నారు. జూబ్లీ హిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక నేపథ్యంలో నియోజకవర్గానికి సంబంధించిన సెక్టార్ అధికారుల శిక్షణ కార్యక్రమం సోమవారం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్‌లో నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆర్ వి కర్ణన్ సెక్టార్ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. సెక్టార్ అధికారులు తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం కనీస వసతులు తాగునీరు, లైటింగ్, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, సరైన విద్యుత్ ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ఎన్నికల ఘటనల ఆధారంగా స్థానిక తహసీల్దార్ లు, స్టేషన్ హౌజ్ ఆఫీసర్ లు, బూత్ లెవెల్ అధికారుల సహకారంతో వల్నరబుల్ మ్యాపింగ్ చేసుకోవాలన్నారు. అనంతరం ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలు సజావుగా నిర్వర్తించడంలో నోడల్ అధికారుల పాత్ర కీలకమన్నారు. ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఉప ఎన్నిక జరిగేలా నోడల్ అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో జోనల్ కమిషనర్ లు అనురాగ్ జయంతి, హేమంత్ కేశవ్ పాటిల్, అపూర్వ చౌహాన్, హేమంత్ సహదేవరావు, రవి కిరణ్ , లీదిది నోడల్ అధికారి నరసింహా రెడ్డి, చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ సునంద, ఈ ఈ ఎలక్ట్రిసిటీ మమత తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ తదితరులు

# రేబిస్ వ్యాధితో బాలుడు మృతి



**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త** బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన జనగామ జిల్లాకు చెందిన శ్రీనివాస్ కుటుంబంలో తీవ్ర విశాధం నెలకొంది. రెండు నెలల క్రితం కుక్కకాటుకు గురైన శ్రీనివాస్ కొడుకు శ్రీచరణ్ రేబిస్ వ్యాధితో తార్నాకలోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో నగరంలో రేబిస్ కలకలం సృష్టిస్తోంది. జనగామ జిల్లా పాలకుర్తి మండలం వావిలాలకు చెందిన మైదం శ్రీనివాస్ కుటుంబం జీవనోపాధి కోసం కొంతకాలం క్రితం హైదరాబాద్‌కు వలస వచ్చింది. ప్రస్తుతం ఈ కుటుంబం మాదాపూర్‌లో నివాసం ఉంటోంది. రెండు నెలల క్రితం శ్రీనివాస్ కుమారుడు శ్రీచరణ్‌ను కుక్క కరిచింది. వెంటనే అతనికి ఇంజక్షన్ కూడా చేయించారు. అయితే రెండు రోజుల క్రితం శ్రీచరణ్ అనారోగ్యానికి గురికావడంతో తల్లిదండ్రులు తార్నాకలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీచరణ్ మృతి చెందాడు.

### గంటకు 14 మందికి కుక్కకాటు..

బాలుడి శ్రీచరణ్ మృతితో నగరంలో కుక్కల బెడద పరిష్కారమెప్పుడన్న ప్రశ్న ఉదయిస్తోంది. శునకాలకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేయించడంలో ప్రభుత్వ యంత్రాంగం సఫలీకృతం కాకపోవడంతో కుక్కకాటుతో రేబిస్ వ్యాధి సోకుఉన్నవారి సంఖ్య పెరిగిపోయి..తీవ్ర సమస్యగా మారింది. తెలంగాణలో గత ఏడాది సగటున గంటకు 14 మంది కుక్కకాటుకు గురయ్యారని, 14మంది రేబిస్ బారినడి ప్రాణాలు కోల్పోయారని సమాచారం. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్తున్నప్పుడో..వీధిలో ఆడుకుంటున్నప్పుడో ఎక్కువగా చిన్న పిల్లలే కుక్కకాట్లకు గురి అవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం 2024లో 1,21,997 మందిని, ఈఏడాది జులై వరకు 87,366 మందిని కుక్కలు కరిచాయి. బాధితుల్లో 15 ఏళ్లలో పువారే అధికం. సాధారణంగా కుక్క కరిచిన కొన్ని రోజుల తర్వాత బాధితులు వైద్యులను కలుస్తున్నారు. కానీ ఆ కుక్కకు రేబీస్ ఉందో లేదో మనకు తెలియదు కాబట్టి వెంటనే



ఆస్పత్రులకు వెళ్లాలని వైద్యులు పేర్కొంటున్నారు. కుక్క కరిచిన గాయం ద్వారా శరీరంలోకి చేరుకునే రేబీస్ వైరస్ అన్ని అవయవాలతో పాటు అంతిమంగా మెదడుకు కూడా చేరుకుంటుంది. వైరస్ మెదడుకు చేరుకోవడం ప్రాణాంతకం. ఈ దశకు చేరుకున్న తర్వాత చికిత్సతో సాధారణ స్థితికి తీసుకురావడం అసాధ్యమని వైద్యులు పేర్కొంటున్నారు.

### ఏ కుక్క కరిచినా..

కుక్క కరిచినప్పుడు, ఎంత లోతుగా కరిచింది అనే దాని మీదే చికిత్స ఆధారపడి ఉంటుంది. కుక్క గోళ్లతో గోకడాన్ని గ్రేడ్ ఎగా, కొరికినప్పుడు పంటిగాగు ఏర్పడితే ఆ గాయాన్ని గ్రేడ్ బిగా, పంటిగాటుతో పాటు రక్తస్రావమైతే గ్రేడ్ సిగా పరిగణిస్తామని ఫీవర్ ఆస్పత్రి వైద్యులు పేర్కొంటున్నారు. ఈ గాయాలకు సబ్బుతో కడిగి, ఆ ప్రదేశంలో రేబిక్యూర్ వ్యాక్సిన్‌తో పాటు, రేబీస్ ఇమ్యునోగ్లోబిలిన్ కూడా ఇవ్వవలసి ఉంటుంది. కుక్కకు ఎలాంటి టీకాలు ఇప్పించకపోయినా, అది వీధి కుక్క అయినా, పెంపుడు కుక్క అయినా రేబీస్ వ్యాక్సిన్ తీసుకోవాలి. సాధారణంగా చాలా మంది వీధిలో రోజూ కనిపించే కుక్క, దానికేం కాలేదు కాబట్టి మాక్కూడా ఏం జరగదు అని చికిత్సను నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. కానీ ఆది ఎలాంటి కుక్క అయినా ఎలాంటి లక్షణాలు లేకున్నా తప్పనిసరిగా వైద్యులను కలిసి ఇంజెక్షన్లు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

# అనుమతులు లేని లేఔట్లు..రహదారుల ఆక్రమణలపై ఫిర్యాదులు

**హైదరాబాద్, అక్టోబర్ 6,ప్రభాతవార్త:** అనుమతులు లేని లే ఔట్లలో రహదారులు, పార్కులు ఆక్రమణకు గురవుతున్నాయి. 60 అడుగుల వెడల్పుతో ఉండాల్సిన రహదారులను ఇరువైపులా ఆక్రమణలు జరుగుతున్నాయి. డబ్బాలు పెట్టి వ్యాపారాలు చేసుకుంటున్నారని.. ఖాళీ చేయమంటే దాడి చేస్తున్నారంటూ పలువురు హైడ్రా ప్రజావాణిలో కమిషనర్ రంగనాథ్ ఫిర్యాదు చేశారు. అనుమతి లేని లేఔట్లలో ప్లాట్లు కొని సరైన రహదారులు, పార్కులు లేక ఇబ్బందులు పడొద్దని వారికి కమిషనర్ సూచించారు. హెచ్ ఎండీఏ, డీటీసీపీ అనుమతి పొందిన లే ఔట్లలో ప్లాట్లు కొంటే రహదారులు, పార్కులు నిర్దేశిత లెక్కల ప్రకారం ఉంటాయన్నారు. బొల్లారం మున్సిపాలిటీలోని ఎన్‌రిచ్ ప్రాంతంలో సర్వే నంబరు 83లో వరకుంట చెరువు కబ్జాలను నివారించాలని.., బాచుపల్లి మండలంలోని నిజాంపేట సర్వే నంబరు 233/15లో ప్రభుత్వ భూమి కబ్జా అవుతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. మేడ్చల్ జిల్లా కాప్రా మండలం జవహర్ నగర్ విలేజ్‌లో తన తండ్రి ఆర్మీ ఉద్యోగి కావడంతో అప్పట్లో ఇచ్చిన భూమిని స్థానికంగా ఉన్నవారు కబ్జా చేసేశారని అతని కుమారుడు ఫిర్యాదు చేశారు. శేరిలింగంపల్లి మండలం మాధాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో 28వ ప్రధాన రహదారి వాస్తవానికి 60 అడుగుల వెడల్పుతో ఉండగా.. కొంత మంది డబ్బాలు పెట్టి వ్యాపారాలు చేసుకుంటుండగా.. అదే మార్గంలో కొంత దూరం వెళ్లాక ఏకంగా వసతి గృహాలను నిర్మించేశారని అక్కడి నివాసితులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. డబ్బాలను తొలగించాలని హైకోర్టు ఆదేశాలున్నాయని.. ఆ ప్రకారం గతంలో తొలగించగా.. ఇటీవల మళ్లీ వాటిని పెట్టి రోడ్డును కబ్జా చేసేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఖాళీ చేయమంటే తమను బెదిరిస్తున్నారని.. లేని పక్షంలో రూ. 40 లక్షలు డిమాండ్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. మేడ్చల్ జిల్లా బూరంపేట గ్రామం సర్వే నంబరు 166/3 లోని ప్రభుత్వ భూమిలో దాదాపు కిలోమీటరు మేర 60 మీటర్ల వెడల్పులో రహదారి నిర్మించి పైన ఉన్న వెంచర్లకు దారి చూపుతున్నారని వెంటనే ఆక్రమణలను ఆపాలని స్థానికులు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిని కిలో మీటర్ల మేర కబ్జా జరుగుతోందని వాపోతున్నారు. రంగరెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం ఆదిత్య నగర్ బాలాజీ నగర్ మధ్య రెండు లింకు రోడ్డులు ఆక్రమణకు గురయ్యాయని.. పార్కు స్థలం కూడా కబ్జాకు గురైందని వెంటనే ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కబ్జా కాకుండా చూడాలని ఆదిత్యనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రాను కోరారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలం సాయిప్రియానగర్‌లో 2500ల ప్లాట్లతో లే ఔట్ వేశారు. ఇందులో 2 వేల గజాల పార్కు ఒకటి ఉండగా.. దానిని కూడా ప్లాట్లుగా చేసి విక్రయించేస్తున్నారంటూ సాయిప్రియా నగర్ నివాసితులు పిర్యాదు చేశారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 41 ఫిర్యాదులందాయి. ఇందులో ఎక్కువగా రహదారులు, పార్కుల ఆక్రమణలే ఉన్నాయి. ఈ ఫిర్యాదులను కమిషనర్ పరిశీలించి వాటి పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు




ఫిర్యాదులను స్వీకరిస్తున్న కమిషనర్ రంగనాథ్

# మెట్రో స్టేషన్ వద్ద కిక్కిరిసిన జనం

## ఎల్బీనగర్‌లో భారీగా ట్రాఫిక్ జామ్..



**హైదరాబాద్, అక్టోబరు 6 ప్రభాతవార్త:** దసరా పండుగ సెలవులు ముగియడంతో ప్రజలు హైదరాబాద్ తిరిగి చేరుకుంటున్నారు. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఎంతకూ వాహనాలు కదలక పోవడంతో జనం మెట్రో రైలును ఆశ్రయించారు. దీంతో ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ వద్ద ప్రయాణికులు కిక్కిరిసి పోయారు. ఈ నేపథ్యంలో మెట్రో సిబ్బంది ప్రయాణికులను క్యూ పద్ధతిలో పంపిస్తున్నారు. జిల్లాల నుంచి వచ్చినవారితో పాటు ఆఫీసులు, వివిధ పనుల నిమిత్తం వెళ్లేవారు పెద్ద సంఖ్యలో ఉండటంతో కిలోమీటర్ మేర క్యూలైన్‌లో నిల్చున్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. క్యూలైన్ నుంచి ఫ్లాట్‌ఫారం వద్దకు చేరేందుకు సుమారు రెండు గంటల సమయం పట్టింది.

# ఓమైగాడ్..పెద్ద ప్రమాదం తప్పింది..!

## పంజాగుట్ట పెట్రోల్ బంకులో కారులో మంటలు



**హైదరాబాద్, అక్టోబరు 6 ప్రభాతవార్త:** పంజాగుట్టలో పెద్ద ప్రమాదం తప్పింది. పెట్రోల్ బంకులో కారులు సడెన్‌గా మంటలు చెలరేగటంతో ఒక్కసారిగా హైటెన్షన్ వాతావరణం నెలకొంది. వెంటనే అలర్ట్ అయిన సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. సోమవారం పెట్రోల్ కొట్టించడానికి వచ్చిన కార్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వెంటనే స్పందించిన పెట్రోల్ పంపు సిబ్బంది..అగ్నిమాపక యంత్రాలతో మంటలను ఆర్పేశారు. దీంతో పెట్రోల్ బంకుకు ప్రమాదం తప్పటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఘటన సమయంలో కారులో ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. పెట్రోల్ బంక్‌లో ఉన్న కార్‌లో మంటలు రావడంతో సిబ్బంది, వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. మంటలను చూసి దూరంగా పరిగెత్తారు వాహనదారులు. మంటలను ఆర్పిన వెంటనే కారును పెట్రోల్ బంక్ నుండి బయటికి తీసుకెళ్లారు. పంజాగుట్టలోని ఎర్రమంజిల్‌లో ఉన్న పెట్రోల్ బంకులో ఈ ప్రమాదం జరిగింది.

# కానిస్టేబుల్ పై కేసు నమోదు

**మెహిదీపట్నం అక్టోబర్ 06, ప్రభాతవార్త** : ఓ వైద్యుడికి సెకండ్ హ్యాండ్ కారులు ఇప్పిస్తానని మోసం చేసిన కానిస్టేబుల్ పై బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్న సంఘటన గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్ స్పెక్టర్ బైరి రాజు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి...రేతిబౌలి ప్రాంతానికి చెందిన డాక్టర్ అబ్దుల్ ఖాదర్ ఖాన్‌కు రెండు కార్ల కోసం కానిస్టేబుల్ మొహమ్మద్ షరీఫ్ ఉద్దీన్ ను సంప్రదించాడు. ఈ క్రమంలో తనకు తెలిసిన పరిచయస్తులు ఉన్నారని కామాటిపురకు చెందిన సెకండ్ హ్యాండ్ కార్ల వ్యాపారి వాజిద్ వద్ద కార్లు ఇప్పిస్తానని డాక్టర్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ వద్ద డబ్బులు తీసుకొని రెండు కార్లను కూడా ఇప్పించాడు. అయితే ఎన్ఓసి ఇవ్వకపోవడంతో డాక్టర్ గత నెలలో కానిస్టేబుల్ పై గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. షరీఫుద్దీన్ గుడిమల్కాపూర్ పిఎస్ లో గత సంవత్సరం విధులు నిర్వహించి, బదిలీపై టోలిచౌకి పిఎస్ లో పనిచేశాడు. ప్రస్తుతం అక్కడి నుంచి బదిలీ అయి ఎస్ బి లో విధులను నిర్వహిస్తున్నాడు.

# ప్రజాపాలనలో అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగాలి : మంత్రి

**యూసుఫ్‌గూడ, అక్టోబర్ 6, ప్రభాతవార్త** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. సోమవారం బోరబండ డివిజన్‌లో రూ.1.50 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌బాబు, రాష్ట్ర మహిళా అభివృద్ధి చైర్మన్ బండ్రు సోభారాని, స్థానిక కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్‌తో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ ప్రజా పాలనలో ఆరు గ్యారంటీలు ప్రజల వద్దకు తీసుకువెళ్లి జరిగిన అభివృద్ధి గురించి ప్రతి కార్యకర్త వివరించాలన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో చేపట్టే అభివృద్ధిపనులు జరుగుతున్నాయని ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. ఇదిలా ఉండగా సోమవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలు ఉండటంతో ఉదయమే శంకుస్థాపనలు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాసుల మహేష్ గౌడ్, శివకుమార్ గుప్తా, ఆనంద్, భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




బోరబండలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఇంచార్జ్ మంత్రి వివేక్

# గాంధీకి మంచి పేరు తేవాలి : ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిర

**సికింద్రాబాద్, అక్టోబర్ 6 ప్రభాతవార్త:** రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన గాంధీ మెడికల్ కళాశాలలో సీటు సంపాదించిన వారు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి కళాశాలకు మంచి పేరు తేవాలని ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిర కోరారు. సోమవారం 2025 బ్యాచ్ నూతన విద్యార్థులకు ఓరియన్ టేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కాలేజీలో సీటు పొందేందుకు ప్రోత్సహించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కళాశాలలో ప్రతి వారం సైకియాట్రి డిపార్ట్మెంట్ వారిచే పిల్లల్లో మానసిక ధైర్యం పెంపొందించేందుకు క్లాసులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కళాశాలలో ర్యాగింగ్ నిరోధానికి కమిటీ వేసి చర్యలు చేపట్టినట్టు తెలిపారు. విద్యార్థులకు మొదటి సంవత్సరం 80 శాతం హాజరు తప్పనిసరి అని విద్యార్థులు తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ వహించి హాజరు శాతం తగ్గకుండా చూడాలన్నారు. గాంధీ హాస్పిటల్ సూపర్నెంట్ డాక్టర్ వాణి మాట్లాడుతూ ఎంతో కష్టపడి సీటు సాధించిన మీరు కళాశా లను రాష్ట్రస్థాయిలో ముందు ఉంచేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రాజశేఖర్ రావు రాజారాం, హెచ్‌వోడిలు రమాదేవి, కోటేశ్వరమ్మ, సుభోద్, సుధారా ణి, ప్రజ్ఞ, అనుపమ సుధాకర్, ఎంపిహెచ్ఓ వేణుగోపాల్ గౌడ్, ఫరూక్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిర తదితరులు

# నగరంలో పీపుల్ వెల్ఫేర్ పోలీసింగ్‌కు ప్రాధాన్యం

## - నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్

**సైదాబాద్, అక్టోబరు 6 ప్రభాతవార్త:** నగర పోలీస్ కమీషనర్ సజ్జనార్ సోమవారం మాదన్నపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ పరిధిలోని శాంతి భద్రతల వివరాలు, కేసుల పురోగతి, స్థానిక అంశాల గురించి సమీక్షించారు. సిబ్బంది హాజరు, క్రమశిక్షణ, రోజువారి విధుల గురించి ఆరా తీశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ సజ్జనార్ మాట్లాడుతూ నగరంలో పీపుల్ వెల్ఫేర్ పోలీసింగ్‌కు ప్రాధ్యానం ఇస్తున్నామని, ఇది ప్రజల భద్రతకు మరింతగా దోహదపడుతుందన్నారు. పీపుల్ వెల్ఫేర్ పోలీసింగ్‌లో భాగంగా శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్-రోడ్డు భద్రత, మహిళా-చిన్నారుల రక్షణ, టెక్నాలజీలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వినియోగం, సైబర్ క్రైమ్స్, ఆర్థిక నేరాల నియంత్రణ, 24/7 సిటిజన్ సర్వీసెస్, సిబ్బంది సంక్షేమం వంటి అన్ని అంశాలపై దృష్టి సారించడం జరుగుతుందన్నారు. సిబ్బంది విధి నిర్వాహణలో అంకిత భావంతో పనిచేయాలని, క్రమశిక్షణతో ఉండాలని అన్నారు. అత్యుత్తమ ప్రతిభను కనబరిచే సిబ్బందిని గుర్తించి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా తప్పు చేసే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని సిపి స్పష్టం చేశారు. కేసుల నమోదులో నిర్లక్ష్యం ఉండకూడదని, ఆలస్యం చేయకుండా విచారణ చేపట్టి చార్జ్‌షీట్ త్వరగా దాఖలు చేయాలని సూచించారు. ప్రతి ఫిర్యాదు దారుడు సంతృప్తిగా స్టేషన్ నుండి వెళ్లేలా చూడాలన్నారు. అనంతరం స్టేషన్ పరిధిలోని సున్నిత ప్రాంతాలను, పికెట్లను, సిసి కెమరాలను కమీషనర్ సజ్జనార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సిపి ఇక్బాల్, డిసిపి అపూర్వరావు, డిసిపి చైతన్యకుమార్, అడిషనల్ డిసిపి శ్రీకాంత్, ఎసిపి వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు ఆంజనేయులు, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.




మాదన్నపేట పోలీస్ స్టేషన్‌లో కమిషనర్ సజ్జనార్



# జంట జలాశయాలకు పెరుగుతున్న వరద

ఉస్మాన్ సాగర్‌కు 1,900 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా 8 గేట్లు ఎత్తి 2,704 క్యూసెక్కులు నీటిని దిగువకు వదులుతున్నారు. హిమాయత్ సాగర్‌కు 1,200 క్యూసెక్కులు ఇన్ ఫ్లో ఉండగా 2 గేట్లు ఎత్తి 1,981 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

## భారతీయ కళల పట్ల ఆసక్తి పెంచుకోవాలి



ఆశీర్వాదం అందచేస్తున్న ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల

**అఫ్జల్‌గంజ్, అక్టోబర్ 6(ప్రభాతవార్త:**
విద్యతోపాటు భారతీయ కళలపై పట్ల ఆసక్తి పెంచుకోవాలని ప్రజా ఏక్తా జాతీయ పార్టీ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ గుప్త అన్నారు. కొడియాపాటి తనవిభరత నాట్యం అరగ్రేటం చేసే ముందు గజ పూజ చేశారు. ఈ పూజ కార్యక్రమంలో ప్రజా ఏక్తాపార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త పాల్గొన్ని ప్రత్యేక పూజ చేశారు. ఈ సందర్భం గా చిన్నారి కోడియాపాక తనవి భరత నాట్యం నేర్చుకోవడం పట్ల ఆయన అభినందించారు. భారత దేశంలో భరత నాట్యం, కూచిపూడి కళలకు ఎంతో గౌరవం ఉందన్నారు. తమ పిల్లల భవిష్యత్తును తీర్చి దిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. చిన్నారి తనవి భరత నాట్యంలో పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. తనవి శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో చండీ హోమం



శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో చండీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం.

**బేగంపేట అక్టోబరు 6, ప్రభాతవార్త**
సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో సోమవారం చండీ హోమం నిర్వహించారు. ఈ హోమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి జి. మనోహర్‌రెడ్డి, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ సురిటి రామేశ్వర్ 100మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఈ ఓ ఆధ్వర్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేసారు.

## సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి: బిజెపి డిమాండ్



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బిజెపి నేతలు

**అల్వాల్, అక్టోబరు 6 ప్రభాతవార్త:**
ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్లు ఇచ్చిన సిబ్బందిపై తక్షణం చర్యలు తీసుకోవాలని భారతీయ జనతాపార్టీ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో బాగంగా సర్కిల్ డిసి శ్రీనివాస్ రెడ్డిని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందించిన అనంతరం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. సర్వే నెంబర్లు 573, 574, 575లోని ఖాళీ స్థలాలలో నిర్మాణాలు లేకుండా 80 ఇంటి నెంబర్లు మంజూరు చేయడాన్ని పెద్ద స్కామ్‌గా వారు అభివర్ణించారు. న్యాయపరమైన వివాదాలు ఉన్నా వాటిని పట్టించుకోక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. అక్రమంగా ఇంటి నెంబర్లు మంజూరు చేసిన సిబ్బందిని తక్షణం విధులు నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి పార్టీ కో కన్వీనర్ మల్లిఖార్జున్ గౌడ్ నేతలు మాణిక్యరెడ్డి, క్రిష్ణారెడ్డి, దండుగుల వెంకటేష్, అజయ్ రెడ్డి, కార్తీక్ గౌడ్, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల దశ దిశ నిర్ధేశించేది ఉపాధ్యాయులే



అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వవిద్యార్థులు

**కుత్బుల్లాపూర్, అక్టోబరు6 ప్రభాతవార్త**
భావి భారతపౌరులుగా బాల్యంనుండే తీర్చిదిద్దే బృహత్తర బాధ్యత కేవలం ఉపాధ్యాయులతోనే సాధ్యమని భారతీయ జనతాపార్టీ నాయకులు ఓబిసి మెర్చా అసెంబ్లీ కొ-కన్వీనర్ తాళ్లూరి రాము అన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరింకుని 1995-96 సంవత్సర పూర్వ విద్యార్థుల నాయకత్వంలో ఖానాపూర్‌లో పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనంలొ భాగంగా ఉపాధ్యాయులను ఘనంగా షాలువాలు, పూలదండలతో సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బూదారావుపేటలోని జిల్లా పరిషత్‌పాఠశాలలో 1995-96లో చదువుకున్న పూర్వ విద్యార్థులు అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించడం అభినంద నీయమన్నారు. గురుర్బ్రహ్మ, గురుర్‌విష్ణు గురుదేవో మహేశ్వరా అన్నసూక్తిని గురువులు విద్యార్థులకు బోధిస్తే దానినితూచా తప్పకుండా పాటించి గురువులను సత్కరించి క్రమశిక్షణ, విజ్ఞతను చాటుకున్న పూర్వ విద్యార్థులందరికీ ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర స్వామి, రవిందర్, ప్రభాకర్, గంగాధర్, బెంజిమెన్‌నుపూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

## పిజి, పిహెచ్‌డి కోర్సుల ప్రవేశాల గడువు పొడిగింపు

**అత్తాపూర్ అక్టోబరు6, ప్రభాతవార్త :**
ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం 2025-26 విద్యా సంవత్సరానికి నిర్వహించనున్న పీజీ (రెగ్యులర్ మరియు ప్రత్యేక కోటా), పీ హెచ్ డీ కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు దాఖలు చేసుకునే గడువు ని పొడిగించినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ ప్రకటించారు. ఆసక్తి కల అభ్యర్థులు తమ దరఖాస్తులని ఆన్ లైన్ లో ఈ నెల 12 వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ దాఖలు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 11 వ తేదీ వరకూ దరఖాస్తు రుసుము చెల్లించవచ్చని వివరించారు. అభ్యర్థుల వినతి మేరకు ఈ నెల 6 వ తేదీ వరకూ ఉన్న దరఖాస్తులు దాఖలు చేసుకునే గడువుని 12 వ తేదీ వరకూ పొడిగిస్తున్నట్లు కోర్సులకు సంబంధించిన పూర్తి వివరాలు విశ్వవిద్యాలయం వెబ్ సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.



కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ యెసో నాయక్‌నుజాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈమేరకు శ్రీపాద్‌యెసోనాయక్‌ను శాలువ కప్పి బొకె అందచేశారు.

## అక్రమ నిర్మాణాలను తొలగించాలి : సిపిఐ నాయకులు

**నిజాంపేట్, అక్టోబర్ 6, ప్రభాతవార్త**
అక్రమ నిర్మాణాలను తొలగించి, ప్రగతి నగర్ వైకుంఠదామని అభివృద్ధి చేయాలనీ సీపీఐ అధ్యర్యంలో బుద్ధాభవన్లోని హైడ్రా ప్రజావానిలో అడిషనల్ కమిషనర్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలాభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ బాచుపల్లి మండలంలో కబ్జాదారులు వెయ్యిల కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాలను ఇష్టరాజ్యాంగ కబ్జాచేస్తుంటే రెవిన్యూ, మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారని అన్నారు. సంతోష్ నాయక్ అనే వ్యక్తి నిజాంపేట్ సర్వే నెంబర్ 191లో 59జిఓ కింద రిజిస్ట్రేషన్ చేసుకోవడమే కాకుండా దాదాపు 200గజాలు కబ్జా చేసి పర్మిషన్ లేకుండా అక్రమ నిర్మాణం చేస్తుందని ఎన్ని సార్లు పిర్యాదు చేసిన రెవిన్యూ, మున్సిపల్ అధికారులకు పట్టించుకోలేదన్నారు. పైగా రెవిన్యూ ఇన్స్పెక్టర్ భాను కలెక్టర్‌కి ఇచ్చే రిపోర్టులో సంతోష్ నాయక్ బిల్డింగ్ పూర్తిగా తొలగిచ్చినట్లు ఇచ్చాడు అంటే అధికారుల పనితీరు ఎలా ఉంటుందో అర్ధం చేసుకోవచ్చని అన్నారు. గతంలో ఎర్ర కుంటలో మాజీ కమిషనర్ ఏమైదో, గతంలో నిజాంపేట్ రెవిన్యూ ఇన్స్పెక్టర్ శ్రీదేవి ఏమైందో గుర్తు పెట్టుకోవలని వారు గుర్తుచేశారు. అలాగే నిజాంపేట్ ఇందిరమ్మ ఇల్లు ఫేస్ 3 బ్లాక్ 21,22 వెనక జరుగుతున్న ప్రభుత్వ స్థలం ఆక్రమించి చేస్తున్న అక్రమ నిర్మాణం దసరా పండుగ ముందు ఆగింది. పండగ సందర్భంగా ఇప్పుడు మళ్ళీ కొనసాగుతుందని గుర్తు చేశారు. అలాగే అక్రమ షెడ్లు ఎక్కడపడితే అక్కడ ప్రగతి నగర్ జగన్ స్టూడియో దగ్గర కూడా చేస్తున్నారని పిర్యాదు చేసిన టౌన్ ప్లానింగ్ బొజ్జ సరితకి చీమ కూటినట్లు కూడా ఐయితలేదు. కొద్దిగా దానిపై దృష్టి పెట్టి పరిశీలించాలని వారు గుర్తు చేశారు. ఒక వైపు ప్రభుత్వ భూమి కబ్జా అవుతుంటే సాధారణ ప్రజలు మరణించిన తరువాత వారి అంతక్రియలు చేయడానికి గత కొంత కాలంగా ఉపయోగిస్తున్న ప్రాంతాని కూడా కబ్జా చేస్తే స్థానిక నాయకులు తప్ప, ఒక అధికారి ప్రభుత్వ, ప్రతిపక్ష నాయకులు అట్టి సమస్యను పరిస్కారం చేయక పోవడం అంటే ఓటు రాజకీయలు తప్ప ప్రజాసమస్యలతో సంబంధం లేదని నిర్దారణ అవుతుందని అన్నారు. పై సమస్యలు వెంటనే పరిష్కరించాలని వారు డిమైండు చేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పొన్నికంటి దాస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌పి.బాలును స్మరించుకోవడం అంటే పాటకు పట్టాభిషేకం చేసినట్లే: వంశీ రామరాజు



గానగంధర్వులు ఎస్‌పి.బాలు ప్రతిమను డాక్టర్ వంశీ రామరాజుకు అందజేస్తున్న ప్రముఖ గాయకుడు శ్రీరామ్‌కుమార్

**చిక్కడపల్లి, అక్టోబరు 6 ప్రభాతవార్త:** పద్మభూషణ్, గానగంధర్వులు డాక్టర్ ఎస్‌పి. బాలసుబ్రహ్మణ్యం స్మరించుకోవడం అంటే పాటకు పట్టాభిషేకం చేసినట్లేనని పలువురు వక్తలు పేర్కొన్నారు. పద్మభూషణ్, గానగంధర్వులు డాక్టర్ ఎస్‌పి. బాలసుబ్రహ్మణ్యం స్మరించుకుంటూ 'బాలు పాటకు బ్రహ్మరథం' కార్యక్రమం సోమవారం సాయంత్రం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళావేంకట దీక్షితులు కళావేదికలో నిర్వాహక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీరామ్‌కుమార్, ప్రముఖ గాయని భార్గవి నాగరాజు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రామ్‌కుమార్ తయారు చేయించిన ఇరవైఆరు అంగుళాలతో ఎస్‌పి. బాలు విగ్రహాన్ని డాక్టర్ వంశీ రామరాజుకు బహుకరించారు. వంశీ రామరాజు మాట్లాడుతూ ఈ విగ్రహాన్ని బుధవారం కుంట్లూరులో ఉన్న ఘంటసాల గుడిలో ఆ మహనీయుడి పక్కనే ఎస్‌పి. బాలు విగ్రహాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా గాయనీ గాయకులు రవి శంకర్, నాగేందర్ పాడిన ఎస్‌పి. బాలు అందరిని మంత్రముగ్దులను చేశాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు హాజరై అద్భుతంగా గానం చేసిన గాయనీ గాయకులను సత్కరించి ప్రసంగించారు. ప్రముఖ సినీగేయరచయిత జెకె.భారవి, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ, పిఎంకె.గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు చెల్లించడంలో రేవంత్ సర్కార్ నిర్లక్ష్యం : వేముల రామకృష్ణ



ప్రసంగిస్తున్న తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ

**హైదరాబాద్ అక్టోబరు 6 ప్రభాతవార్త:** రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల బకాయిలను చెల్లించడంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆరోపించారు. సోమవారం బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసీ సుంధరీకరణకు నిధులు మాత్రం వస్తాయని, కాని రాష్ట్రంలో 12.75లక్షల మంది విద్యార్థుల స్కాలర్‌షిప్పులకు మాత్రం నిధులు మంజూరు చేయడం సాధ్యం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపకార వేతనాలు సరైన సమయంలో అందకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఫలితంగా ఉన్నతం విద్యలో రాణించాలనే కల నెరవేరడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రం జుబ్లీహిల్స్ ఉప ఎన్నికలు, మూసి సుందరకరణపై ఉన్న శ్రద్ధ విద్యార్థులపై లేదన్నారు. ఈ సమాశంలో బీసీ విద్యార్థి సంఘం నేతలు రాజేష్, ప్రవీణ్, కుమార్, జగదీష్, దయాకర్, బాలు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో పూజలు



శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, అక్టోబరు 6 ప్రభాతవార్త:**
చిక్కడపల్లి బాపూనగర్‌లోని బాపుసేవక్ సమాజ్, శ్రీ రాజ రాజేశ్వరి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని శివశ్రీ ఆనంద్‌స్వామి, శివశ్రీ ఈశ్వర్‌స్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా విశేషంగా పూజలు నిర్వహించారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్, బిజెపి నేత జి.దామోదర్ తదితరులు పాల్గొన్నారు. ఆ జగన్మాత ఆశీస్సులతో సకల సుఖాలు ప్రతి ఒక్కరికీ కలగాలని ఆశిస్తున్నానని అన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులకు తీర్థప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో లలితాసహస్రనామ పారాయణ కుంకుమార్చన కార్యక్రమం భక్తిశ్రద్దలతో నిర్వహించారు.

## ప్రతి ఒక్కరు పేదలను అదుకునేందుకు ముందుకు రావాలి : ఎమ్మెల్యే ముఠాగోపాల్



బిఆర్‌ఎస్ నేత వివేక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

**చిక్కడపల్లి, అక్టోబరు 6 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు పేదలను అదుకునేందుకు ముందుకు రావాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లి చౌరస్తాలో బిఆర్‌ఎస్ సీనియర్ నేత రూపుల వివేక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని బిఆర్‌ఎస్ రాష్ట్ర నేత ఎంఎన్.శ్రీనివాసరావు, యువనేత ముఠాజైసింహాతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాంనగర్ డివిజన్ బిఆర్‌ఎస్ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి మన్నె దామోదర్‌రెడ్డి, సీనియర్ నేతలు వెంకటకృష్ణ(బబ్లూ), ముచ్చకుర్తి ప్రభాకర్, అయినేని కిషన్‌రావు, కూరగాయల శ్రీను, అస్లామ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఠాగోపాల్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ఉన్న అనుభూతి మరెందులో ఉండదన్నారు. ప్రతి ఒక్కరు ప్రజలెదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలన్నారు.

## రాంచందర్‌రావుతో ఆలపాటి లక్ష్మీనారాయణ భేటి

**జూబ్లీహిల్స్, అక్టోబరు 6, ప్రభాతవార్తః**
బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావును జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీజేపీ నేత ఆలపాటి లక్ష్మీనారాయణ సోమవారం కలిశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, బీసీ నేతగా తనకు అవకాశం ఇవ్వాలంటూ కోరారు. పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని, పార్టీ నిర్ణయానుసారం నడుచుకోవాలని సూచించినట్లు లక్ష్మీనారాయణ తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీసీ ఓటర్లు అత్యధికంగా ఉన్న విషయాన్ని సైతం అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

## దుర్గామాత లాకెట్ వేలంపాటలో రూ.లు లక్షా 35వేలు

**జగద్గిరిగుట్ట, అక్టోబరు 6 ప్రభాతవార్త**
కుత్బుల్లాపూర్ సర్కిల్ రంగారెడ్డినగర్ డివిజన్‌లోని శ్రీపోచమ్మ ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఓజ్జోళ్ల బాల్ రాజ్ యాదవ్, జి.సుధాకర్, మామిడాల రవిందర్‌రెడ్డి, రమేష్, పరుష వేణులతోపాటు కమిటీ నిర్వాహకులు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఊరేగింపు సందర్భంగా నిర్వహించిన అమ్మవారి చేతిలోని ఒకగ్రాము లాకెట్‌ను రు.లు.లక్ష 35వేలకు ఆరుట్ల సుధాకర్ దక్కించుకున్నారు. యాభైగ్రాముల వెండి లాకెట్‌ను యాభై ఎనమిది వేలకు నందిమల్ల ప్రవీణ్‌కుమార్ దక్కించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ నిర్వాహకులు ఓజ్జోళ్ల బాల్‌రాజ్ యాదవ్ మాట్లాడుతూ రంగారెడ్డినగర్ వాసులపై అమ్మవారి కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని కోరారు. కుల,మత వేధంలేకుండా దుర్గామాత ఉత్సవాలు, ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతిఒక్కరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు. ఊరేగింపు అనంతరం అమ్మవారి నిమజ్జనంకోసం ఏడుపాయల వనదుర్గాదేవి ఆలయానికి తరలివెళ్లారు.

## డిజిపి శివధర్‌రెడ్డిని కలిసిన రాజిరెడ్డి



డిజిపి శివధర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఐఎన్‌టియూసి ఉపాధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 6 ప్రభాతవార్త**
రాష్ట్రానికి నూతనంగా నియమితులైన డిజిపి బి.శివధర్ రెడ్డిను సోమవారం ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి కలిశారు. అయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా డిజిపి బి. శివధర్ రెడ్డికి దసరా, దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

## ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

**యూసుఫ్‌గూడ, అక్టోబర్ 6, ప్రభాతవార్త**
నియోజవర్గంలోనే ఆదర్శ వంతమైన డివిజన్‌గా రహమత్ నగర్‌ను తీర్చిదిద్దే విధంగా తగిన విధంగా కృషి చేయటం జరుగుతుందని డివిజన్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని ఎస్పీఆర్ హిల్స్ మహాత్మానగర్‌లో రూ.7.50 లక్షలతో సీసీ రోడ్డు పనులకు, హెచ్‌ఎఫ్‌నగర్‌లో రూ.ఒక కోటి 20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్‌నగర్ డివిజన్‌లో చేపట్టే అభివృద్ధికి ఇంచార్జ్ మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు ఎంతో సహాయ సహకారాలు అందిస్తూ ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టేలా సహకరించారని పేర్కొన్నారు.

## గుండెసంబందిత అంశాలపై అవగాహన సదస్సు

**చిక్కడపల్లి, అక్టోబరు 6 ప్రభాతవార్త:** గుండె నాళాల్లో అవరోధాలు ఏర్పడే వారికి, సకాలంలో రోగ నిర్ధారణ , డ్రగ్‌కోటెడ్ బెలూన్లు వంటి కొత్త చికిత్సా ఎంపికలను పొందడం దీర్ఘకాలిక ఫలితాలను మెరుగుపరచడంలో సహాయపడుతుందని ప్రముఖ హృద్రోగ వైద్యనిపుణులు డాక్టర్ పంకజ్ జరివాలా అభిప్రాయపడ్డారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో గుండె సంరక్షణకు కొత్త విధానం: మెటల్ స్టెంట్లు లేకుండా మూసుకుపోయిన ధమనులకు చికిత్స అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ జరివాలా మాట్లాడుతూ నేడు తెలంగాణలో ప్రధాన ఆరోగ్య సవాళ్లలో ఒకటిగా గుండె జబ్బులు నిలుస్తున్నాయని, చిన్న వయస్సులోనే ఎక్కువ మంది ఈ సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

## 8నుంచి ఎన్టీఆర్ స్టేడియంలో "అమృత ఉత్సవాలు "

**-కామాఖ్యామృత శోధన అధ్యక్షులు కె.వి.వి సతీష్‌బాబు**



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సతీష్‌బాబు, ప్రసన్నకుమార్ తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 6,ప్రభాతవార్త:**
ప్రపంచ శాంతి, సౌభ్యాగ్యం కొరకు అమృతానంద సరస్వతి ఆశిస్సులతో..వేణుశ్యామ ఆధ్వర్యంలో ఈనెల 8నుంచి 10వరకు మూడురోజులపాటు అమృత ఉత్సవాలు" నిర్వహించనున్నట్లు కామ్యాఖ్యామృత శోధన అధ్యక్షులు కె.వి.వి సతీష్‌బాబు, సెక్రటరీ ప్రసన్నకుమార్‌లు తెలిపారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు సతీష్ బాబు మాట్లాడుతూ మూడురోజులపాటు నిర్వహించే ఈకార్యక్రమంలో లక్షలాదిమంది భక్తులకు పాల్గొంటారని అందరికీ ఉచిత ఎంట్రీ ఉంటుందని కాకపోతే రిజిస్ట్రేషన్ తప్పకుండా చేసుకోవాలన్నారు. మొదటిరోజు బుధవారం ఆనందగళ లలితామృతం కార్యక్రమంలో భాగంగా సామూహిక లలితా సమస్రనామ పారాయణం సాయంత్రం 5గంటలకు జరగుతుందని తెలిపారు. అలాగే రెండోరోజు గురువారంఅష్టోత్తర సిరిజ్యోతి పూజ కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వెయ్యికిలోల పుష్పాలతో చక్ర అలంకరణ, 5 గంటల నుంచి సిరిజ్యోతిపూజ, కళావానం, కడ్గమాలార్చన నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే చివరిరోజు శుక్రవారం అష్టోత్తర సిరిజ్యోతి పూజ, అనంత అమృత ఛండీహోమం సాయంత్రం 4గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున ఆసక్తిగల వారందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు పనుల నాణ్యతలో రాజీపడే ప్రసక్తేలేదు : కొలన్ హన్మంత్‌రెడ్డి



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న హన్మంత్‌రెడ్డి

**కొంపల్లి, అక్టోబర్ 6, ప్రభాతవార్త**
రోడ్డు పనులలో నాణ్యతలో రాజీపడే ప్రసక్తేలేదని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎల్.జి విస్టాస్‌లో బి.టి రోడ్డు పూర్తిగా పాడువటంతో కాలనీ వాసులు హన్మంత్‌రెడ్డి దృష్టికి తీసుకవచ్చి సమస్యను పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన హన్మంత్ రెడ్డి మున్సిల్ ఫండ్స్ ద్వారా బి.టి రోడ్డు నిర్మాణానికి కొరకు రూ.40,00,000 లక్షల రూపాయలు మంజూరు చేయించారు. మంజూరైన నిధులతో సోమవారం కొలన్ హన్మంత్ రెడి ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. అనంతరం కాలనీ వాసులు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్, జిల్లా లేబర్ సెల్ ప్రెసిడెంట్ సుదర్శన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ శివ కుమార్ గౌడ్, ఎక్స్ వార్డు మెంబెర్ కావాలి గోపాల్ ముదిరాజ్, ఎక్స్ ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి, మోహన్ రెడ్డి, జైబెరి గోపాల్ రెడ్డి, అంజి ముదిరాజ్, నాగరాజు యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం రాజేందర్ రెడ్డి, సిద్ద నోళ్ల సంజీవ రెడ్డి కాలనీ అధ్యక్షులు అధ్యక్షులు భాగ్యరెడ్డి, రాజేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, సంతోష్ రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మార్వాడి గో బ్యాక్ జెఎసికి ఏర్పాటైన నూతన కార్యవర్గం



సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

**సైఫాబాద్, అక్టోబరు 6 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఏర్పాటైన మార్వాడి గో బ్యాక్ జెఎసికి సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఈ మార్వాడి గో బ్యాక్ జెఎసిని రాష్ట్రంలో మరింతగా బలోపేతం చేయడానికే నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోడం జరిగిందని జెఎసి రాష్ట్ర కమిటీ ఛైర్మన్ డా.పిడమర్తి రవి చెప్పారు. ఈ మేరకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జెఎసి కో-ఛైర్మన్‌గా కరాటే శ్రీహరి, కో-ఆర్డినేటర్‌గా బొమ్మర స్టాలిన్, ఉపాధ్యక్షుడిగా అందె కృష్ణ, కార్యనిర్వాహక అధ్యక్షులుగా సురేందర్ సన్ని, పి.రాములునేత, డా.మీసాల మల్లేష్, వైస్-ఛైర్మన్‌గా గజ్జల మల్లికార్జున్, మాదుగుల నరసింహ, గుర్రం కోటేష్, రాష్ట్ర కార్యదర్శిగా మాదుగుల శివ, నక్క రమేష్, జోగు గణేష్, శ్రీనివాస్‌గౌడ్, సూర్యారావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా చాగంటి శేఖర్, సికింద్రాబాద్‌కు కిషన్‌యాదవ్, మహబూబ్‌నగర్‌కు బుర్ర సురేష్, యువజన విభాగం అధ్యక్షుడిగా నక్క మహేష్, మహిళా కన్వీనర్స్‌గా వరలక్ష్మి, ఓయూ జెఎసి అధ్యక్షుడిగా ఎండి రహీం నియమితులైనారని ఆయన చెప్పారు.

### పేదల కోసం 'విక్టిమ్స్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్ట్' ఏర్పాటు

**సైఫాబాద్, అక్టోబరు 6 ప్రభాతవార్త:** నిస్సాహాయులైన వృద్దులు, చేతగానివారు, మహిళలకు పోలీసులు-కోర్టులు అంటేనే భయం ఉన్నవారికి మద్దతుగా ఒక లీగల్ టీమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని 'విక్టిమ్స్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్ట్' తెలిపింది. పేదలకు సంబంధించి ఆర్థిక నేరాలు, రియల్ ఎస్టేట్, చిట్‌ఫండ్స్, అక్రమ ఆర్థిక మోసాలు, షేర్ మార్కెట్ మోసాలు, గృహ హింస తదితర సమస్యల పరిష్కారం కోసం ఉచితంగా సేవలు అందించడానికి ఈ 'విక్టిమ్స్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్ట్' ఏర్పాటు చేయడం జరిగిందని ట్రస్ట్ కన్వీనర్ జి.గిరిప్రసాద్‌శర్మ, కో-కన్వీనర్ మామిళ్లపల్లి విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వృద్దులు, నిరుపేదలకు నేరుగా ప్రభుత్వమే తమ ఇంటి వద్దకు వచ్చి సేవలు అందించే విధంగా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు ఇచ్చిన పిర్యాదు మేరకు ముందుకు సాగుతామని చెప్పారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు న్యాయ సలహాలు తీసుకుని ముందుకు సాగుతామన్నారు. ఇతర వివరాలకు 9701609689 సెల్ నెంబరుకు ఫోన్ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

### కాంగ్రెస్ బాకీ కార్డు ఉద్యమంపై కీలక సమావేశం

**దుండిగల్, అక్టోబర్ 6, ప్రభాతవార్త**
బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన నయవంచక హామీలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బాకీ కార్డు ఉద్యమాన్ని మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా చేపట్టాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో మేడ్చల్ బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు ఆధ్వర్యంలో పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి మల్లా రెడ్డి, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణరావు, వివేకానంద గౌడ్, బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి అలాగే మాల్కాజ్గిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిలతో పాటు జిల్లా ముఖ్యనాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 420 హామీలను పూర్తిగా మోసం చేసిందని, ప్రజలను మభ్యపెట్టిందని విమర్శించారు. ప్రజల పట్ల ఈ కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని, వంచనను బయటపెట్టడానికి బీఆర్‌ఎస్ పార్టీ బాకీ కార్డు రూపంలో ప్రజల్లోకి వస్తోందని పేర్కొన్నారు.



జాతీయ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ప్రగతి నగర్‌లో వడ్డే ఓబన్న వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జాతీయ వడ్డెర సంఘం నాయకులు దండుగుల స్వామి, దండుగుల ఎల్ల స్వామి, మార్ల మధు, రామకృష్ణ, అశోక్, సత్తయ్య, రాముడు, దండు స్వామి, రాజు, శివ, చంద్రయ్య, శ్రీనివాస్, శేఖర్, వడ్డెర బంధువులు పాల్గొన్నారు.

## సర్దార్ కుటుంబానికి బిఆర్‌ఎస్ అండ



ఎస్పార్టీనగర్‌లో మైనారిటీ అధ్యక్షులు సర్దార్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజ్.

**యూసుఫ్‌గూడ, అక్టోబర్ 6, ప్రభాతవార్త**
అన్ని వేలల కార్యకర్తలకు అండగా నిలచే పార్టీ బీఆర్‌ఎస్ పార్టీ అని బోరబండ బీఆర్‌ఎస్ ఇంచార్జ్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజులు అన్నారు. గత కొన్ని నెలల క్రితం బోరబండ డివిజన్ పరిధిలోని ఎస్పార్టీ నగర్‌లో డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షులు సర్దార్ మృతి చెందగా ఆయన కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకునేందుకు బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం సర్దార్ కుటుంబానికి ఇంటిని నిర్మాణం కోసం రూ.3 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ అభివృద్ధి కోసం పాటు పడిన సార్దర్ ఇంటి నిర్మాణం చేపడుతుంటే కాంగ్రెస్ నాయకులు సర్దార్ కుటుంబాన్ని ఆయన ఎదుగుదలను చూసి ఓర్వలేక కక్ష్యపూరితంగా వ్యవహరించడంతో తీవ్ర మనోవేదనకు గురై సర్దార్ ఆత్మహత్యకు పాల్పడ్డారని సార్దర్ కుటుంబానికి బీఆర్‌ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపినాథ్ కుమారుడు మాగంటి వాత్సల్య బాధిత కుటుంబాన్ని కలిసి మనో ధైర్యాని అందించారు.

## చిన్నారుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయాలి : పిఎసి చైర్మన్ హరికెపూడి గాంధీ



**కెపిహెచ్బి కాలనీ, అక్టోబర్ 6, ప్రభాతవార్త**
చిన్నారులలో దాగిన సృజనాత్మకతను వెలికి తీసి వారిలో పోటీతత్వం నెలకొల్పి చిన్నారులు ఎంచుకున్న రంగాలలో ప్రోత్సాహించాలని, వారిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి అటు వైపు ప్రోత్సహిస్తే విజేతలుగా నిలుస్తారని పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని రాంకీ పెరల్ కాలనీలో శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచిన చిన్నారులకు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో కలిసి పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ బహుమతులను అందజేశారు. అనంతరం గాంధీ మాట్లాడుతూ చిన్నారులలో దాగిన సృజనాత్మకతను వెలికి తీసి వారిలో పోటీతత్వం నెలకొల్పి ప్రోత్సాహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రశేఖర్ మృతదేహాన్ని తెప్పించేందుకు ప్రభుత్వం కృషి : విహెచ్



చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న హనుమంతరావు.

**వనస్థలిపురం. అక్టోబర్.6.ప్రభాతవార్త.** అమెరికాలో దుండగుల కాల్పుల్లో మృతిచెందిన పోలే. చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను సీనియర్ కాంగెస్ నాయకులు, మాజీ రాజ్యసభ సభ్యుడు వి. హనుమంతరావు సోమవారం బి.యన్.రెడ్డి. నగర్ టీచర్స్ కాలనీలో గల చంద్రశేఖర్ నివాసానికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అమెరికా నుండి చంద్రశేఖర్ మృతదేహాన్ని తెప్పించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందన్నారు. పరామర్శించిన వారిలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేరేడ్‌మెట్‌లో మహిళా పోలీసులు సైకిల్ పెట్రోలింగ్



**నేరేడ్‌మెట్, అక్టోబర్ 6,ప్రభాతవార్త**

స్థానికంగా మహిళల భద్రత కోసం రాచకొండ పోలీస్ కమిష నరేట్ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జేజే నగర్, డిఫె న్స్ కాలనీలలో నేరేడ్ మెట్ పోలీస్ స్టేషన్ కు చెందిన మహిళా పోలీసులు సి ఐ సందీప్ కుమార్ ఆదేశాల మేరకు సైకిల్ పెట్రో లింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పోలీసులు స్థానిక మహిళలకు సైబర్ క్రైమ్ ముప్పులు, ఆన్‌లైన్ మోసాలు, ప్రాపర్టీ అఫెన్సెస్ పై అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు, సంఘటనలు గమనించిన వెంటనే 100 నెంబర్ లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. అలాగే మొబైల్ ఫోన్లలో ఫేక్ లింకులు, ఫ్రాడ్ కాల్స్‌కి జాగ్రత్తగా ఉండా లని, అపరిచితులకు బ్యాంక్ వివరాలు ఇవ్వకూడదని హెచ్చరిం చారు. సైకిల్ పెట్రోలింగ్ ద్వారా మహిళా సిబ్బంది వంతు వంతున కాలనీలలో గస్తీ తిరుగుతూ, ప్రజల్లో భద్రతా నమ్మకం కల్పించారు. ఈ కార్యక్రమంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మహిళా భద్రత కోసం పోలీసులు చేపట్టిన ఈ ప్రత్యేక పద్ధతి, ప్రజలకు మరింత భరోసానిచ్చిందని స్థానికులు పేర్కొన్నారు.

## ప్రజాసేవలో ముందుండే పిట్టల నాగరాజు



**నేరేడ్ మెట్ అక్టోబర్ 6,ప్రభాతవార్త**

ప్రజాసేవ పట్ల అంకితభావంతో ఎల్లప్పుడూ ముందుండే పిట్టల నాగరాజు , 137వ డివిజన్ వినాయక నగరంలో నివాసముంటు న్న లలిత అనే నిరుపేద కుటుంబానికి అండగా నిలిచారు. లలిత కుమారుడు మురళి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల కన్నుమూశాడు. ఈ విషయం ఆలస్యంగా తెలిసిన పిట్టల నాగరాజు తీవ్రంగా విచారం వ్యక్తం చేశారు. హిందూ సం ప్రదాయం ప్రకారం 11వ రోజు నిర్వహణ కోసం ఆ కుటుంబానికి కావలసిన నిత్యావసర వస్తువులను కొనుగోలు చేయడానికి రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా పిట్టల నాగరాజు మాట్లాడుతూ, "ఈ సేవా కార్యక్రమం మైనం పల్లి హన్మంతన్న గారి ఆశీర్వాదంతోనే సాధ్యమైంది. ప్రతి సేవ దుర్గమ్మ ప్రేరణతోనే జరుగుతుందని నమ్ముతున్నాను" అని చెప్పారు. ప్రతి సేవా కార్యక్రమంలో పి. నాగరాజు సభ్యుల పాత్ర అమూల్యమని నాగరాజు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## సమస్యలను వెంటనే పరిష్కరించాలి



జలమండలి జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆకుల శ్రీవాణి

**హుడా కాంప్లెక్స్ , అక్టోబర్ 6, ప్రభాతవార్త:**

డివిజన్ లో నెలకొన్న7సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సరూర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి జల మండలి జనరల్ మేనేజర్ బలరాం కు సోమవారం వినతిపత్రం అందజేశారు. డివిజన్ పరిధిలోని డాక్టర్స్ కాలనీ, బాపు నగర్, విజయపురి కాలనీ, అంబేద్కర్ నగర్, శ్రీనివాస కాలనీలలో శివరేజ్ పైప్ లైన్, మ్యాన్ హోల్ చాంబర్స్ పునరుద్ధరణ పనుల గురించి చర్చించి, త్వరగా సమస్యల పరిష్కారం కోసం పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందేలా కృషి చే యాలని కోరారు. కార్యక్రమంలో డిజీఎం సన్యాసిరావు పాల్గొన్నారు.

## సమాజాభివృద్ధికి కృషి : గోపి రావు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రేస్ కోర్స్ చైర్మన్ సురేందర్ రెడ్డి, రేస్ టు విన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వై. గోపి రావు తదితరులు

**మలక్ పేట ,అక్టోబర్ 6, ప్రభాతవార్త:** సమాజాభివృద్ధికి, ప్రాథ మిక విద్యకు, గుర్రాల సంరక్షణ కోసం రెస్ టు విన్ ఫౌండేషన్ ఎంతో కృషి చేస్తుందని సంస్థ వ్యవస్థాపకులు వై. గోపి రావు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం మలక్ పేట రేస్ కోర్స్ లో నిర్వహించిన డెక్కన్ డర్బీ 2025 కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. డెక్కన్ డర్బీ రేస్ లలో గెలుపొందిన వారికి రేస్ కోర్స్ చైర్మన్ సురేందర్ రెడ్డి, రేస్ టు విన్ ఫౌండేషన్ వ్యవస్థా పకులు వై .గోపి రావు లు బహుమతులను అందజేశారు. పలు వురు సినీ, మోడలింగ్ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. మాలైక అరోరా షో స్టాపర్ గా వ్యవహరిం చగా, ఫ్యాషన్ షో ప్రదర్శనలో మోడల్స్ రోహిత్ గాంధీ, రాహు ల్ కన్నా , ప్రముఖ సినీ తారలు రెజీనా కసాండ్రా, అర్జున్ బ జ్వా,అవంతిక మిశ్రా, ఏక్త రాథోడ్ రాశీసింగ్ , లేఖ ప్రజా పతి, రోహిత్ ఖండేల్వాల్, పార్వతీ నాయర్, అక్షర్ గౌడ పాల్గొన్నారు.

## వడ్డెర జాతి వీరుడు వడ్డే ఓబన్నకు ఘన నివాళులు



**తుర్కయంజాల్ అక్టోబర్ 6 ,ప్రభాతవార్త**

స్థానిక సంస్థ ఎన్ని కల్లో బిసి రిజర్వేషన్ లలో ఎ, బి, సి, డి వర్గీకరణ చేయాలి మొదటితరం స్వా తంత్ర సమరయో ధుడు, రేనాటి వీరు డు వడ్డే.ఓబన్న గారి 179 వ వర్ధంతిని తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్నికి ముఖ్య అతిథులు వడ్డెర వృత్తిదా రుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కుంచం వెంకటకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లపు విఘ్నేశ్ లు హాజరై నివాళుల ర్పించారు. మాట్లాడుతూ స్వాతంత్రం కోసం తన మిత్రుడు అయిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డితో కలిసి వడ్డే.ఓబన్న బ్రిటిష్ వారితో చివరి శ్వాస వరకు విరోచితంగా పోరాడి 39 సంవత్స రాల వయస్సు లోనే వీరమరణం చెందారని కొనియాడా రు. ఈ కార్యక్రమంలో వడ్డెర వృత్తిదారుల సంఘం రంగారెడ్డి జిల్లా కన్వీనర్ నర్ర పాండు,సీనియర్ నాయకులు గండికోట సత్యం, నాయకులు తన్నీరు సైమన్, వరికుప్పల రాంబాబు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## పోషణ కరువైన ఆవులను రైతులకు అప్పగించాలి : ప్రేమ్ సాగర్ యాదవ్

**కుషాయిగూడ, అక్టోబర్ 7, ప్రభాతవార్త.**

కొన్ని ఘోషాలలో ఆహారం దొరకక బక్క చిక్కిన ఆవుల ను రైతులకు అప్పగించి వాటి శ్రేయస్సుకు పాటుప డాలని రైతు సేవా సంఘం వ్యవస్థాపకులు కొమ్ము ప్రేమ్ సాగర్ యాదవ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు గోశాలలో ఆహారమందక ఆదరణ లేక బక్క చిక్కిన స్థితిలో చావుకు దగ్గరైన ఆవులను రైతులకు అప్పగించాలి లంటూ ఆయన డిమాండ్ చేశారు. తద్వా రా రైతులు వాటిని పోషించడంతోపాటు ఆర్థికంగా లా భపడతారన్నారు. దైవ సమానమైన ఆవులను అన్యా యంగా చావు బారిన పడకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. పలు గోశాలల్లో ఆవుల దయనీయస్థితి దుర్భ రంగా ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వ్యవసాయం చేసి రైతులు ఆవులను అపురూపంగా చూసుకొని వాటి ద్వారా పాలను సైతం పొంది ఆర్థికంగా ఎదుగుతారని పేర్కొన్నారు. యోగక్షేత్రంలో ఆవులను పెంచడం ద్వారా భూమి సాంద్రత పొందుతుందన్నారు. ఈ విషయమే ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకొని కావులను రైతు లకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ఆవులను వ్యవ సాయ రైతుల కొప్పగించడం ద్వారాగోశాలలో ఉనద్వారా గోశాలలో గోసపడుతున్నాయి వాటికి సరైన ఆహారం లేక వాతావరణం లేక వ్యాయామం లేక పక్క చిక్కిపోయి చనిపోతున్నాయి కావున ఇలాంటి స్వేచ్ఛ జీవిని బంధిం చరాదని కొమ్ము ప్రేమ్ సాగర్ యాదవ్ తెలిపారు అంతేకా కుండా ఆవు పల్లెల్లో ప్రజల మధ్యలో రైతుల వద్ద ఉండాలని అది రైతుల మధ్య ఉంటే ఆవు ఆవు సుఖప డుతుంది రైతు బాగుపడతాడు ఆవు మదమూత్రాల



ఆహారమందరి గోశాలలో ఆవుల దుస్థితిని పరిశీలిస్తున్న రైతు సేవా సంఘం వ్యవస్థాపకులు కొమ్ము ప్రేమ్ సాగర్ యాదవ్ బృందం

ద్వారా భూమి ఎంతో సారవంతమైతుంది ఆ భూముల పండిన పంటలు తిన్న ప్రతివారు ఆరోగ్యవంతులవు తారు కావున గోశాలలో ఉండడం కన్నా పకృతిలో ప్రజల మధ్యలో ఉండాలని రైతు సంక్షేమ సేవా సంఘం కోరుకుంటుంది ఎందుకలాగా ఈమధ్య పశు సంపద అం తరించిపోయి రసాయనికి ఎరువులు హైబ్రిడ్ పంటలు అందిస్తూ మనుషుల ఆరోగ్యాలు పాడు చేస్తున్నారు కావున మన పూర్వీకులు ఎట్లా వ్యవసాయం చేశారో అదే పద్ధతిలో మళ్లీ వ్యవసాయం చేయాలంటే పశువులను వాటి ప్రాముఖ్యత తెలుసుకొని పశువులను పోషిస్తూ సంరక్షిస్తూ వాటి బెనిఫిట్స్ అన్ని ప్రజలు పొందాలని కొమ్ము ప్రేమ్ సాగర్ యాదవ్ అందరికీ మనవి చేశారు అ యితే ఇప్పుడు ప్రైవేట్ గోశాలలో మన రాష్ట్రంలో 220 ఉన్నాయి అలాగే ఆయిల్ 220 అఫీషియల్ గా 45000 ఆవులు ఉన్నట్లు చెపుతున్నారు కానీ మా సర్వే ప్రకారం ఒక లక్ష 20వేల ఆవులు ఉన్నట్లు గుర్తించామన్నారు.

## పార్కు ను కబ్జా చేసిన వ్యక్తుల పై చర్యలు తీసుకోవాలి : లచ్చిరెడ్డి

**వనస్థలిపురం. అక్టోబర్.6.ప్రభాతవార్త.**

బి.యన్ రెడ్డి నగర్ డివిజన్లోని శ్రీపురం కాలనీలో విని యోగంలో ఉన్న శ్రీ చత్రపతి శివాజీ పార్కును అక్రమం గా కొంతమంది ప్రైవేటు వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేసుకు న్నారని బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం శ్రీపురం కాలనీసార్ సంక్షేమ సంగం నాయకులు ఫేస్ 1 ప్రెసిడెంట్ ముత్యం రావు, జనరల్ సెక్రెటరీ నారాయ ణరెడ్డి, ఫేస్ 2 ప్రెసిడెంట్ శ్రీధర్ రెడ్డి, జనరల్ సెక్రట రీ విట్టల్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సికిందర్ రెడ్డి, మరియు కాలనీ ప్రజలతో కలిసి వనస్థలిపురం సబ్ రిజిస్టర్ మరియు జిహెచ్ఎంసి అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పార్కును ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని ప్రశ్నించారు. అక్ర మ దారిలో కోర్టులను కూడా తప్పుదోవ పట్టించి ఈ తం తును జరిపారని విమర్శించారు. 50 కోట్ల రూపాయల విలువైన భూమికి ప్లాన్ వేశారని తాము ఉండగా అది జరగనివ్వమని హెచ్చరించారు. శ్రీపురం కాలనీ లో సు



రిజిస్ట్రేషన్ అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి ,కాలనీవాసులు.

మారు 20 వరకు అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై పూర్తి విచారణ జరిగేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతామని చెప్పారు. జిహెచ్ఎంసి అధికారులు వెంటనే రంగంలోకి దిగి ఈ అక్రమ రిజిస్ట్రేషన్లతంతుపై సమగ్ర నివేదిక తయారుచేసి రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు అందివ్వాలని కోరారు. ఆ డాక్యుమెంట్లు రద్దు చేసే వరకు విశ్రమించే ప్రసక్తే లేదన్నారు.

## పాలకుల నిర్లక్ష్యంతోనే కారిడార్ పనులు ఆలస్యం : జూలకంటి రంగారెడ్డి

**ఉప్పల్, అక్టోబరు 6 ప్రభాతవార్త :** ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మించతలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులను సత్వరమే పూర్తి చేయాలని కోరుతూ సిపిఐ(ఎం) మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యం లో ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ 18 నెలల్లో కారిడార్ నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పి, ఏడేండ్లు గడిచినా 50 శాతం మాత్రమే పనులు పూర్తి చేయలేదన్నారు. ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది బిజెపి ఎంపిలు, సిఎం రేవం త్‌రెడ్డి వంటి హేమాహేమీలు ఉన్నా పనులు ముందుకు సాగడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య కారణంగానే పనుల్లో జాప్యం జరుగుతోందని విమర్శిం చారు. కారిడార్ పనుల ఆలస్యం వల్ల ఉప్పల్ నుంచి వరంగల్ వైపు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రోడ్లు గుంతల మయంగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. లేకుంటే సిపి ఎం ఆధ్వర్యంలో పోరాటం తీవ్రతరం చేస్తామన్నా రు. ప్రభుత్వాల చేతగాని తనం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. సీపీఐ (ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం మాట్లాడుతూ ఉప్పల్ కారిడార్ పనులపై మంత్రులు అనేక ప్రకటనలు చేస్తున్నారని, అయితే పనులు ముందు కు సాగడం లేదన్నారు. గతంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దసరా వరకు పనులు పూర్తి చేస్తామని చెప్పారని, తిరిగి మాట మార్చారని పేర్కొన్నారు. స్థానిక



ఎలివేటెడ్ కారిడార్ పూర్తి చేయాలని ఉప్పల్ చౌరస్తాలో నిరహారదీక్ష చేస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జూలకంటి రంగారెడ్డి, మాజీ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి తదితరులు

ఎంపి ఈటల రాజేందర్ స్పందించి కేంద్రంపై ఒత్తిడి తీ సుకురావాలని కోరారు. గతంలో ఎంపిగా పనిచేసిన ప్రస్తుత సిఎంకు ప్రజల గోస పట్టదా అని ప్రశ్నించారు. పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి మాట్లా డుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ నగరంలో 36 ప్లై ఓవర్లు నిర్మించామని,. కాంగ్రెస్ ప్రభు త్వ హయాంలో రియల్ ఎస్టేట్ పడి పోయిందన్నారు. ఉప్పల్ నుంచి పీర్జాదిగూడకు వెళ్లేందుకు గంట సమ యం పడుతుందన్నారు. గత సీఎం కేసీఆర్ ను సైతం కలిసి విన్నవించినట్టు గుర్తు చేశారు. సీపీఐ ఉప్పల్ మం డల కార్యదర్శి సత్య ప్రసాద్ మాట్లాడుతూ కారిడార్ ప నులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. ఈ సంద ర్భంగా పలువురు సంఘాల నేతలు మద్దతు ప్రకటించా రు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆన గంటి వెంకటేష్, సీపీఐ (ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జె.చంద్రశేఖర్, కోమటి రవి, ఎం.వినోద, రాజశేఖర్, ఎం.శ్రీనివాస్, జిల్లా కమిటీ స భ్యులు సబిత, రాదజోడ్ సంతోష్ శంకర్, లక్మన్, ఉప్ప ల్ మండల కార్యదర్శి వెంకన్న, పాల్గొన్నారు.

## పద్మశాలి మేళాను విజయవంతం చేయాలి : కమ్మర్తపు మురళి

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 6 ప్రభాతవార్త:** పద్మశాలీల అభి వృద్ధి ఆత్మవిశ్వాసం ఐక్యత కోసం పద్మశాలి మేళ దోహ దపడుతుందని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కమ్మర్తపు మురళి పేర్కొన్నారు. ఎల్బీనగర్ సర్కిల్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు పున్న గణేష్‌నేత అధ్యక్షతన ఈనెల 12వ తేదీన ఆటోనగర్‌లోని హరిణ వనస్థలి ఆవరణలో అనన్య ఎకో పార్క్ వద్ద 23వ రాష్ట్రస్థాయిలో పెద్దఎత్తున నిర్వహించే పద్మశాలి దసరా మేళ పోస్టర్ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ..పద్మశాలి సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించుకోవడం, ప్రముఖు ల సంక్షిప్త సందేశాలు, చేనేత కళా కారులకు సన్మానా లు, సమాజ శ్రేయస్సుకు సహకరిస్తున్న పెద్దలను సన్మా నించడం, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర కార్యక్ర మాలు, సహపంక్తి భోజనాలు నిర్వహిస్తా మన్నారు. ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించే ఈ ఆత్మీయ సమ్మేళనానికి రాష్ట్రంలోని పద్మ శాలీలు అందరూ పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు గుంటక రూప సదాశివ్, దసరా మేళ చైర్మన్ కౌకుంట్ల రవితేజ, అఖిల భారత పద్మశాలి సంఘం యువజన విభాగం అధ్యక్షుడు



అవ్వరు భాస్కర్ మాట్లాడుతూ మేళాలో పద్మశాలి మహి ళలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని అన్నారు. చిన్నగా ప్రారంభమైన మేలా నేడు వేలాది మంది సమక్షంలో జరుగుతుందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ప్రతి పద్మశాలి కుల బాంధ వుడు బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు గుర్రం శ్రావణ్, గడ్డం లక్ష్మీనారాయణ, కత్తుల సుదర్శన్, స్వప్న, రేఖ, ఉరుకొండ రమాదేవి, పేరాల సుజాత ,చి క్క భారత మ్మ, గుర్రం విశ్వేశ్వర్, తలాటి రమేష్, జెల్లా జగన్నా థం, పడాల రవీందర్, పుట్టపర్తిని నగేష్, దొర్నా ల చంద్రమౌళి, చిటుపోలు శ్రీనివాస్, మాకం గోపాల్, కర్నాటి విజయ్, గుత్తి పూర్ణిమ, ఇడెం సంతోషి, మిరి యాల సుదర్శన్, చెరుకు స్వామి, పద్మ, బోడ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## గ్రామస్తుల సమస్యలు పరిష్కరిస్తామని సబితా ఇంద్రారెడ్డి హామీ

**సరూర్‌నగర్, అక్టోబర్ 6 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 13వ డివిజన్ కిందకు వచ్చే సుల్తాన్‌పూర్ గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరింపజేసి అవస రమైన అభివృద్ధి పనులు జరిపిస్తామని నియోజకవర్గ శాసనసభ్యురాలు, మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి గ్రామస్తులకు హామీనిచ్చారు. సోమవారం ఆమె గ్రామం లో పర్యటించి బొడ్రాయి వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె గ్రామంలో పాదయాత్రలు చేసి సమస్య లు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ము ఖ్యంగా స్థానిక మహిళలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, ఔట్‌లెట్, రోడ్డు పనుల జాప్యం తదితర సమస్యలు ఉన్నట్లు తెలుసుకున్న ఆమె సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తగు చర్యల విషయమై సూచనలు చేశారు. ఆ తర్వాత ఎమ్మెల్యే మా ట్లాడుతూ సుల్తాన్‌పూర్ గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తీర్చడానికి కృషి చేస్తామని హామీనిచ్చారు.



సుల్తాన్‌పూర్‌లో పర్యటించి డ్రైనేజీ, ఔట్‌లెట్ సమస్యలుపరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ఈ కార్యక్రమంలో స్థానిక పూర్వ వెంకటాపూర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బొర్ర జగన్‌రెడ్డి, యువ నాయకు డు జెనిగె శ్రీనివాస్ యాదవ్, సీనియర్ మైనారిటీ నాయకుడు ఖైసర్ బామ్, బొర్ర మాధవరెడ్డిలతో పాటు బడంగ్‌పేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ దేవాలయం చైర్మన్‌గా బాబు శ్రీనివాస్



దేవాలయం కమిటీ చైర్మన్ బాబు శ్రీనివాస్, ధర్మకర్తలు చౌకి రవికుమార్ తదితరులను సన్మానిస్తున్న దృశ్యం

**మలక్ పేట ,అక్టోబర్ 6, ప్రభాతవార్త:** ఓల్డ్ మలక్ పేట్ లోని శ్రీ పోచమ్మ దేవాలయం నూతన చైర్మెన్ గా బాబు శ్రీనివాస్, ధర్మకర్తలుగా చౌకి రవికుమార్ పటేల్, శ్రీనివాస్ గుప్తా, శివకుమార్ గౌడ్, ఏం.సునీత లు నియమితులయ్యారు. దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో వారితో ఎండోమెంట్ అధికారులు కిరణ్ కుమార్, రాము తదితరులు ప్రమాణ స్వీకారం చేయించారు. దేవాలయం కమిటీ చైర్మన్ గా నియమితులైన సందర్భంగా బాబు శ్రీనివాస్ మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బుగుడాల సుధాకర్, బిజెపి నాయకులు వేమూరి రామ్ కోటేశ్వరరావు, చీపిరి రాజారావు గౌడ్, ఎం. రాజ్ కుమార్, కమల్ కిషోర్ , రాజు, విష్ణుదేవ్ తదితరులు పాల్గొన్నారు

## పండుగలు మతసామరస్యాన్ని ప్రతిబింబిస్తాయి



మలక్ పేటలో అమ్మవారి విగ్రహాన్ని ఘనంగా ఊరేగిస్తున్న నిర్వాహకులు పిటి శంకర్ ముదిరాజ్ తదితరులు

**మలక్ పేట ,అక్టోబర్ 6, ప్రభాతవార్త:**

మలక్ పేట శ్రీ పోచమ్మ దేవాలయంలో ఏర్పాటు చేసిన దుర్గా మాత అమ్మవారి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో మేళ, తాళాలు, డప్పు వాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. ఊరేగింపులో పాల్గొ న్నవారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పిటి శంకర్ ముదిరాజ్ మాట్లాడుతూ పండుగలు మతసామరస్యాన్ని ప్రతిబింజేస్తాయని పేర్కొన్నారు. శ్రీధర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మ వారి ఊరేగింపు కార్యక్రమంలో చౌకీ రాజు, నరేందర్ ముదిరాజ్, చౌకి రవికుమార్, టిల్లు సింగ్, బాబా గౌడ్, చందు, మహేష్ కుమార్, సాయి కుమార్, ఓంకార్, వినయ్ కుమార్, పునీత్ కుమార్ పాల్గొన్నారు

## ప్రతి ఒక్కరు రాజకీయంగా ఎదగాలి : ఎమ్మెల్యే



గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బోదాస్ రవిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**కుషాయిగూడ ,అక్టోబర్ 7, ప్రభాతవార్త**

ప్రతి ఒక్కరు విద్యాపరంగా సామాజికంగా ఎదిగినప్పుడే రాజకీ యంగా ఎదగలుగుతారని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని ఎస్ బి కాలనీకి చెందిన తెలంగాణ ఉద్యమ నేత వడ్డెర వడ్డీల సంఘం నాయకులు భోదాసు రవి గ్రేటర్ హైదరాబాద్ వడ్డెర వడ్డీల సంఘానికి అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా ఆయన అభినందిస్తూ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రాజకీయ చైతన్యం తెచ్చుకోవాలన్నారు. వడ్డెర వడ్డీల సంక్షేమం కోసం కృషి చేసే ప్రభు త్వాలకు తమ అండగా నిలుస్తామనీ గ్రేట్ హైదరాబాద్ అధ్య క్షులు బోదాస్ రవి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ బి కాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి, వంజరి ప్రవీణ్ కరిపే, వీరభద్ర రావు, బాల్రాజ్, శేఖర్ పాల్గొన్నారు.

## గ్రీన్‌పార్క్ కాలనీలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పర్యటన



అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, అక్టోబరు 6 ప్రభాతవార్త:** లింగోజిగూడ డివిజన్ గ్రీన్‌పార్క్ కాలనీలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సోమవారం అధి కారులతో కలిసి మురుగునీటి సమస్యను మరోసారి పరిశీలించారు. సమస్య పరిష్కారానికి అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రీన్‌పార్క్ కాలనీ, సింగరేణి కాలనీల మధ్య ఉన్న ఎస్.ఎన్.డి.పి నాలాలో అవాంతరాలను తొలగించడానికి జిహెచ్ఎంసి, ఎస్ఎన్ డిపి, వాటర్‌వర్క్స్. ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచే యాలని సూచించారు. గంగ థియేటర్ సమీపంలో నాలా ఔట్‌లెట్ వద్ద ప్రవాహం సాఫీగా వెళ్లేలా మరింత వెడల్పు చేయాలని, మెగా ఫంక్షన్‌హాల్ వైపు నుండి వచ్చే మురునీటి ప్రవాహాన్ని దారి మళ్లిం చేలా చర్యలు చేపట్టాలని, డ్రెయిన్స్‌లో పేరుకుపోయిన సిల్టును తొలగించాలని, చార్మినార్, ఎల్‌బినగర్ సర్కిల్ అధికారులు సమన్వ యంతో పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు మహేష్ రెడ్డి, శ్రీనివాస్, అశోక్‌రెడ్డి, బలరాం, రాజు, మాధవిలత, కార్తీక్, విజయ్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జగన్‌రెడ్డి, కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు పగిడిమర్రి తిలక్‌రావు, ఇంద్రాజీ, రాకేష్, అనిల్, ప్రసాద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కానికి కృషి : కార్పొరేటర్

**సైదాబాద్, అక్టోబరు 6 ప్రభాతవార్త:**

ప్రజా సమస్యల పరి ష్కారంలో ఎల్లవేళలా ముందంజలో ఉంటా మని లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గ్రీన్‌పార్క్ కాలనీలో మురుగు నీటి సమస్య పరిష్కా రంలో భాగంగా చేప డుతున్న నాలా స్లాబ్ కటింగ్ పనులు పర్యవేక్షించిన అనంతరం కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లెలగూడ చెరువు నుండి నీటి ప్రవాహం ఎక్కువగా వస్తుండడంతో గ్రీన్‌పార్క్ కాలనీలో 30 ఫీట్ల రోడ్డులో ఉన్న బాక్స్ డ్రెయిన్ నిండిపోయి వరదనీరు రోడ్డు పై కి వస్తుందన్నారు. 30 ఫీట్ల రోడ్డు నుండి వరదనీటిని 40 ఫీట్ల రోడ్డు వైపు మళ్లించే పనుల అనుమతులు ఇప్పటికే మంజూరు కావ డం జరిగిందని, అయితే వర్షాల వల్ల అధికారులు పనులు చేపట్ట లేదన్నారు. సోమవారం ఈ పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. త్వరలోనే సమస్య పరి ష్కారమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇఇ కార్తీక్, రవిచంద్, విజయ్, రాకేష్ పాల్గొన్నారు.



నాలా స్లాబ్ కటింగ్ పనులు పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

## రామంతాపూర్ డివిజన్‌కు రూ.2.50 కోట్ల నిధులు



జలమండలి ఎండి అశోక్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, గంధం నాగేశ్వర్‌రావు తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 6 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్ లో మంచినీటి సమస్యతోపాటు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరిచేందుకు రూ.2.50 కోట్ల నిధులు మంజూరు అయినట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్‌రావుతో కలిసి జలమండలి ఎండి అశోక్‌రెడ్డిని కలిసి పలు సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రామంతాపూర్ వివేక్‌నగర్ నుంచి శ్రీనివాసపురం వరకు, మధురానగర్ నుంచి మురుగునీటి పైప్‌లైన్ పనులు మం జూరు అయినట్లు తెలిపారు. మధురానగర్, వివేక్‌నగర్, తూర్పు శ్రీనివాసపురం తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ పనులు, మంచినీటి పైప్‌లైన్ పనులు చేపడుతున్నామని తెలిపారు. త్వరలోనే పనులను టెండర్లు పిలిచి చేపడుతామని తెలిపా రు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## గ్రూప్1లో డీఎస్పీగా ఎంపికైన శాంతన్ కుమార్‌రెడ్డికి అభినందనలు



శాంతన్ కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న నరసింహారెడ్డి, ఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 6 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలో గ్రూప్1 ఫలితాలలో 30వ ర్యాంక్ సాధించి డీఎస్పీగా ఎంపికైన బుసిరెడ్డి శాంతన్‌కుమార్‌రెడ్డికి జ్ఞాపికను అందజేసి, గజమాల, శాలువాతో ఘనంగా సత్కరించిన మార్కెట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిలుక నర సింహారెడ్డి, సంఘ సేవకులు చిలుక ఉపేందర్‌రెడ్డిలు అభి నందనలు తెలిపారు. ఈ సందర్భంగా చిలుక బ్రదర్స్ మా ట్లాడుతూ రాచకొండ కమిషనరేట్ పరిధిలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న బుసిరెడ్డి రవీందర్‌రెడ్డి కు మారుడు శాంతన్ డీఎస్పీగా ఎంపిక కావడం పట్ల సంతో షం వ్యక్తం చేశారు. యువత శ్రమను ఆయుధంగా మార్చు కుంటే విజయం సొంతమవుతుందని తెలిపారు. శాంతన్ గెలుపు కేవలం వ్యక్తిగత విజయమే కాదని, అనేక పేద, మధ్యతరగతి యువతకు స్ఫూర్తినిస్తుందన్నారు. ఈ కార్యక్ర మంలో తోడుపునూరి సతీష్, పెద్దవూర సైదులు, జగని రమేష్, వెంపటి కృష్ణమోహన్, మామిడి రామకృష్ణగౌడ్, రాజశ్రీ రామారావు, వెంకటేశ్వర్లు, రఘు, పగడాల ఎల్లన్న, వెంకట రమణరెడ్డి(రాజు), రఘువీర్, వెంకట్‌రెడ్డి, రాములు, శివలింగం, బాలరాజు, సత్యనారాయణ, శ్రీనివాస్, నాగేందర్, వినయ్, శేఖర్, పాండు, వెంకటేశ్వర్ రావ్, విప్లవ్ పాల్గొన్నారు.

## ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ విజయవంతం చేయాలి : పారిజాత



సమావేశంలో మాట్లాడుతున్న పారిజాత నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, అక్టోబర్ 6 ప్రభాతవార్త:** ఓటు చోరీకి వ్యతిరే కంగా జాతీయ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా టిపిసిసి ఇచ్చిన పిలుపు మేరకు గ్రామ గ్రామాన సంతకాల సేకరణ కార్యక్రమాలను విజయ వంతం చేయాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సిం హారెడ్డి పిలుపునిచ్చారు. కార్పొరేషన్ పరిధిలోని ప్రాంతాల్లో చేపట్టే సంతకాల సేకరణ కార్యక్రమాల నేపథ్యంలో పార్టీ నేతలకు దిశా నిర్దేశనం చేసేందుకు సోమవారం గడ్డిఅన్నా రం మార్కెట్ కమిటీ డైరెక్టర్, కార్పొరేషన్ కాంగ్రెస్ ఇంఛార్జి బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య నాయ కుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరై న ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ను అపహాస్యం చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న బిజెపిపై రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని అన్నారు. ఈ మేర కు పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ఓటు చోరీపై ప్రజల వద్దకు వెళ్లి సంతకాల సేకరణ చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, బండారి మనోహర్, నేనావత్ బాలు నాయక్, ఏఐసిసి విచార్ విభాగ్ కో–ఆర్డినేటర్ బోయ పల్లి రాఘవేందర్‌రెడ్డి, బాల్‌నింగని జంగయ్య, నవారు మల్లారెడ్డి, బోయపల్లి వెంకట్‌రెడ్డి, రాళ్ళగూడెం శ్రీనివా స్‌రెడ్డి, పెద్దబావి బాబు దర్శన్‌రెడ్డి, బంగారి అశోక్, గట్టు బాలకృష్ణ, గుర్రం లక్ష్మారెడ్డి, జక్కిడి విష్ణువర్ధన్‌రెడ్డి, వల్లపు సుభాన్ యాదవ్, సూర్ణగంటి విజయ్, ఇక్కె శ్రీనివాస్, గిరి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి : కార్పొరేటర్

**సైదాబాద్, అక్టోబరు 6 ప్రభాతవార్త:**

సైదాబాద్ డివిజన్ లోకాయుక్త కాలనీలో రూ.10లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిపాల్‌రెడ్డి, సుభాషిణి, హైమావతి, దేశపాండే తదిత రులు పాల్గొన్నారు.

## అల్మాస్‌గూడ కాలనీ రోడ్లలో అస్తవ్యస్థ డ్రైనేజీలు

### పరిశీలించిన కాంగ్రెస్ నేత నవారు మల్లారెడ్డి

**సరూర్‌నగర్, అక్టోబర్ 6 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సి పల్ కార్పొరేషన్‌లోని 24, 26 డివిజన్ల పరిధి కిందకు వచ్చే అల్మాస్‌గూడ విశాఖనగర్ ఫేస్–3, శ్రీ సాయి హోమ్స్, వెంకటేశ్వర కాలనీలలో సోమవారం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కాంటెస్టెడ్ కార్పొరేటర్ నవారు మల్లారెడ్డి పర్య టించి డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అస్తవ్యస్త డ్రైనేజీ వ్యవస్థల కారణంగా అదే విధంగా ఔట్‌లెట్ సమస్యల వల్ల ప్రజలకు కలుగుతున్న ఇబ్బం దులను ఆయన పరిశీలించారు. ఈ మేరకు స్పందించిన ఆయన స్థానిక డ్రైనేజీ, ఔట్‌లెట్ సమస్యలను బడంగ్‌పేట్ మున్సిపల్ కమీషనర్, డిఇఇల దృష్టికి తీసుకెళ్ళి పరిష్క రింపజేస్తామని స్థానిక కాలనీవాసులకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో గోలి రంజిత్‌రెడ్డి, రూపచారి, సందీప్‌రెడ్డి, చె వుల శ్రీను, రాజశేఖర్, గాంధీ నాయక్, రాజు పాల్గొన్నారు.